## సింగరేణి కార్మికులకు లాభాల బోనస్



ప్రెస్‌మీట్‌లో మూడో వరుసలో ఉన్న సీఎండీ

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 20: దసరా కానుకగా సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం లాభాల బోనస్‌ను శుక్రవారం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సాధించిన రూ.4701 కోట్ల లాభాల్లో సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికలకు రూ.2289 కోట్లు కేటాయించింది. మిగిలిన రూ.2412 కోట్లలో 33 శాతాన్ని (రూ.796 కోట్లను) లాభాల వాటా బోనస్‌గా కార్మికులకు చెల్లించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం సచివాలయంలో ప్రకటించారు. ఒక్కొక్క కార్మికుడికి సగటున రూ.1.90 లక్షల వరకు అందనుంది. సింగరేణి చరిత్రలో ఇదే అత్యధిక లాభాల వాటా. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు.

**సీఎండీకి దక్కని ప్రాధాన్యం**

లాభాల వాటా ప్రకటించేందుకు ప్రభుత్వం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సంస్థ సీఎండీ తగిన రీతిలో ప్రాధాన్యం దక్కలేదన్న విమర్శలు వస్తున్నాయి. సీఎండీ బలరాంను ఎక్కడో మూలన కూర్చోబెట్టడాన్ని కార్మికులు, కార్మిక నాయకులు తప్పుపడుతున్నారు.

## 45 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి, నిందితులతో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం

భద్రాచలం, సెప్టెంబర్ 20: కారులో అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం భద్రాచలం ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద శుక్రవారం పట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలంలోని కూనవరం రోడ్డు వద్ద గల చెక్‌పోస్టు వద్ద ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం వాహన తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో ముకేశ్ మిశ్ర, గుజ్జర్ శ్రీరాములు ఒడిశా నుంచి రాజస్థాన్‌కు కారులో వెళుతూ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి కారును తనిఖీ చేశారు. దీంతో 45.175 కిలోల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించి.. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీశ్, హన్మంతరావు, వెంకట్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

సారపాక, సెప్టెంబరు 20: సారపాకలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్ పద్మజ ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలకు ఎనిమియా రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు ఈశ్వరి, రచన, ఎం రమాదేవి, తార, ఆశావర్కర్, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కాటం వెంకట్రామిరెడ్డి, ప్రభాకర్, చిరంజీవి, లాలయ్య, రఘు, శంకర్ పాల్గొన్నారు.

## అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 20: మండలంలోని మర్కోడు, పాతూరు, రాఘవాపురం, రామానుజగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం అధికారులతో సమావేశం, సమీక్ష నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్లను ప్రారంభించారు. మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ శకుంతల, ఎంపీడీవో శ్రీను, ఐసీడీఎస్ సీడీపీవో తార, సూపర్‌వైజర్ విజయకుమారి, డాక్టర్ రేవంత్, వివిధ శాఖల ఏఈలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలు కఠినం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 20: ఇప్పటికే అమల్లోకి వచ్చిన నూతన చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఈ చట్టాలపై ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రైవర్లకు, విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ముందుగా పోలీస్ సిబ్బంది, అధికారులు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌వో బత్తుల సత్యనారాయణ, ఎస్సై సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రుణ మాఫీ చేయాలి

చుంచుపల్లి, సెప్టెంబర్ 20: అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ అమలు చేయాలని సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో గతంలో రుణం తీసుకున్న ప్రతీ రైతుకు రుణ మాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డైరెక్టర్లు వేల్పుల మల్లేష్, కర్నాటకపు రాంచందర్‌రావు, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలి

చర్ల, సెప్టెంబరు 20: వరద బాధితులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ వరద బాధితుల పోరాటసంఘం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, మాస్‌లైన్ నాయకులు శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, ప్రతి బాధితుడికి 5 సెంట్లు భూమి ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## కొబ్బరి చెట్లు ఎక్కడంపై శిక్షణ

అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 20: కొబ్బరి చెట్లను ఎక్కడంపై నిరుద్యోగులకు ఈ నెల 23 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ (విజయవాడ) సహకారంతో శిక్షణ తరగతులను స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహించనుననట్లు వివరించారు. 50 సంవత్సరాల లోపు వయసున్న పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థితోపాటు నామినీ ఆధార్ జిరాక్స్, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా శిక్షణకు హాజరుకావచ్చని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# నేటి ఓటమి.. రేపటి గెలుపు





భద్రాచలం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం, అశ్వారావుపేట: కబడ్డీ ఆడుతున్న దృశ్యం

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 20: ''ఆటల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలే. నేడు ఓడిన వారు.. రేపు గెలవొచ్చు. నేటి ఓటమి.. రేపటి విజయానికి పునాదిగా నిలుస్తుంది. కాబట్టి, ఆటల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ.. ఎప్పుడో ఒకప్పుడు విజేతలుగా నిలుస్తారు'' అని, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల స్థాయి మండల క్రీడాపోటీలు స్థానిక వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ముగిసాయి. ముగింపు కార్యక్రమ ముఖ్య అతిథి జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలని అన్నారున. అంతకు ముందు, పోటీలను ఆయన కొద్దిసేపు వీక్షించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అండర్-17 విభాగంలో స్థానిక బీసీ బాలురు గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థి కాట్రాల అశోక్ కుమార్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాడు. ఎంఈవో కీసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**దమ్మపేట రూరల్‌లో..**

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 20: మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు శుక్రవారం పార్కలగండి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ముగిసాయి. విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రదానం చేశారు. ఎంఈవో లక్ష్మి, హెచ్ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

**భద్రాచలంలో..**

భద్రాచలం, సెప్టెంబరు 20: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా తమ ప్రతిభను చాటుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం భద్రాచలం జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తెల్లం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరిక దేహధారుడ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. యువత క్రీడలపట్ల ఆసక్తి చూపితే అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవడంతో పాటు ఉత్సాహంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆదివాసీ సంఘ నాయకులు పూనెం వీరభద్రం, గుండు శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగ బాలికపై లైంగిక దాడి

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 20: మానసిక వికలాంగురాలైన బాలిక(17) పై లైంగిక దాడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఒక గ్రామంలో మానసిక వికలాంగురాలైన బాలిక శరీరంలో మార్పులు, వంటిలో నలత తదితర లక్షణాలను కుటుంబీకులు గుర్తించారు. ఆమెను కొత్తగూడెం ఆసుపత్రికి తీసుకెళ్లి గర్భస్రావం చేయించారు. కేసు నమోదు చేసినట్లు, బాధితురాలి నమూనాలను డీఎన్ఏ పరీక్షకు పంపినట్లు ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

## డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ శాఖకు నష్టం

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 20: ఓ డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన వివరాలు.. టేకులపల్లి మండలానికి చెందిన డ్రైవర్ భూక్యా కిషన్, తన మినీ లారీతో భద్రాచలం నుంచి శుక్రవారం తెల్లవారుజామున టేకులపల్లి వెళుతున్నాడు. అతడు నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా జగన్నాథపురం వద్ద డివైడర్ మధ్యలో ఉన్న నాలుగు విద్యుత్ స్థంభా లను లారీ ఢీకొంది. అవి పూర్తిగా దెబ్బతినడంతో విద్యుత్ శాఖకు రూ.30వేలు నష్టం జరిగినట్లు ఏఈ రవీందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. అక్కడే ఉన్న రేకుల షెడ్డు కూడా ధ్వంసమైంది.

## వెంకటరెడ్డికి రేగా నివాళి



వెంకటరెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రేగా కాంతారావు

అశ్వాపురం, సెప్టెంబరు 20: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మర్రి వెంకటరెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆయన నివాసానికెళ్లి వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మొండికుంట పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెంకటసుబ్బమ్మ ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఇటీవల కాలువిరిగి ఇంటివద్ద ఉన్న బీఆర్ఎస్ జిల్లా రైతువిభాగం నాయకుడు ఈదర సత్యనారాయణను ఇంటికివెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల ఆందోళనకు స్పందించిన ఎమ్మెల్యే



గ్రామస్తులతో మాట్లాడుతున్న కోరం కనకయ్య

టేకులపల్లి, సెప్టెంబర్ 20: రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా పూర్తి కాకపోవడంపై, ఆ మార్గంలో బొగ్గు లారీల రాకపోకలతో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు-అధికారులు పట్టించుకోకపోవడంపై మండలంలోని దాస్‌తండా గ్రామస్తులు గురువారం మండిపడ్డారు. బొగ్గు లారీలను అడ్డుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించారు. ఆయన శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి, అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులు పదిహేను రోజుల్లో తిరిగి మొదలయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నిర్మాణం పూర్తయ్యేంత వరకు రోడ్డుపై దుమ్ము లేవకుండా రోజుకు మూడుసార్లు నీళ్లు చల్లించేలా సింగరేణి అధకారులతో మాట్లాడతానని చెప్పారు. నాయకులు అజ్మీరా శివ, పోశాలు, చందర్ సింగ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

**వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి**

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 20: స్థానిక శ్రీ హరిహర క్షేత్ర ఆలయంలో భక్తుల కోసం మంచినీరు, స్నానపు గదులు తదితర వసతులు కల్పించాలని కోరుతూ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఆయన క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందించారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, ధర్మ కర్తల మండలి బాధ్యులు కండె రమేష్, చంద్రశేఖర్, ఎల్లయ్య, విజయ, పద్మావతి, నాగేందర్, కాంగ్రెస్ నాయకులు పులి సైదులు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి ర్యాలీ నిర్వహించిన ముస్లింలు



మణుగూరు: ర్యాలీ చేస్తున్న ముస్లింలు



పాల్వంచ: శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 20: మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్‌లోగల జామే మసీద్ కమిటీ సభ్యులు, మత పెద్దల ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం జుమా నమాజ్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం సురక్షా బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తా, అంబేద్కర్ సెంటర్ జామె మసీద్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ... మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని ఆయన చూపిన ప్రవచనాలు ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ, సహనం, శాంతి కలిగి జీవించాలన్నారు. కార్యక్రమంలో మోయినుద్దీన్, ఇస్మాయిల్, జావీద్, ముస్తఫా, సిరాజ్, నూరుద్దీన్, ఖాసీం, ఫజల్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం అర్బన్‌లో..**

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20: మిలాద్ ఉన్ నబీ జులూస్ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో ముస్లింలు శుక్రవారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పాత డిపో మజీద్ నుంచి రైల్వే స్టేషన్, బస్టాండ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు, రామవరం మదీనా మజీద్ నుంచి రామవరం సెంటర్ వరకు వేర్వేరుగా జులూస్ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు నయీం ఖురేషి, నాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

**పాల్వంచలో..**

పాల్వంచ, సెప్టెంబర్ 20: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించాల్సిన జులుసే మమహ్మదీ కార్యక్రమాన్ని, అదే రోజున వినాయక నిమజ్జనం ఉండడంతో ముస్లిం మత పెద్దలు శుక్రవారానికి వాయిదా వేశారు. ఈ రోజున పాల్వంచలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు.

**రామవరంలో..**

రామవరం, సెప్టెంబర్ 20: రామవరం 14 నంబర్ ఏరియాలోని మదీనా మస్జిద్‌లే ఆహాలే సున్నత్ వల్ జమాతే ఆధ్వర్యంలో శుక్రవారం జులూస్ శాంతి ర్యాలీ జరిగింది. కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, మస్జిద్ అధ్యక్షుడు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీ టీచర్లకు పదోన్నతి కల్పించిన ప్రభుత్వం.. వేతనంలో సగం కోత విధించడంపై దారుణమని అన్నారు. అప్‌గ్రేడ్ చేసిన సెంటర్లలో పనిచేస్తున్న మినీ టీచర్ల వేతనం రూ.7,750 నుంచి రూ.13,650గా చేసి జీవో విడుదల చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. తమతో వెట్టి చేయించుకుంటున్న ప్రభుత్వం.. వేతనాలు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నదని ప్రశ్నించారు. ఆందోళనకారుల వద్దకు చేరుకున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజేత.. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం అంగన్‌వాడీలు వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు కంచర్ల జమలయ్య, మల్లికార్జున్, మోహన్, గోనె మణి, భూక్యా లలిత, పాయం శ్రీలత, రమాదేవి, పద్మ, సరోజిని, శ్రీదేవి, అరుణ, సునీత, వెంకటమ్మ, లలిత, సరస్వతి, రాజేశ్వరి, స్వర్ణ, రమణ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

## 'తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు'

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 20: హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాముల తెలుగు విద్యాలయం పేరు మార్చాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్య వైశ్య సంఘం డిమాండ్ చేసింది. మండల అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి తాతా శ్రీను శుక్రవారం అశ్వారావుపేటలో విలేకరులతో మాట్లాడారు. భాషా ప్రయుక్త రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాముల పేరును తొలగించడమంటే.. తెలుగు జాతిని అవమానించినట్లేనని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మహనీయులను అగౌరవపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'విశ్వకర్మ' దరఖాస్తులకు ఆహ్వానం

టేకులపల్లి, సెప్టెంబర్ 20: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి 18 కుల వృత్తిదారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో రవీందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి గుర్తింపు కార్డు, నైపుణ్య అభివృద్ధి ధ్రువపత్రం, టూల్ కిట్ ప్రోత్సాహకం, రుణ సహాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం, మార్కెటింగ్ మద్దతు అందుతాయని వివరించారు. వడ్రంగి(సుతారీ/కార్పెంటరీ), పడవల, ఆయుధ/కవచ, కమ్మరి, సుత్తులు, టూల్‌కిట్, తాళాల తయారీదారులు, స్వర్ణకారులు, కుమ్మరి, చెప్పులు కుట్టేవారు, బుట్టలు/చీపుర్లు/చాపల తయారీ, కొబ్బరిపీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, మంగళి, పూలమాలల తయారీదారులు, రజకులు, టైలర్‌లు, మత్స్యకారులు, వలల తయారీదారులు.. ఈ పథకానికి దరఖాస్తు చేసేందుకు అర్హులన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

**సర్టిఫికెట్లు అందజేత**

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20: కొత్తగూడెంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పీఎం విశ్వకర్మ పథకం కింద శిక్షణ పూర్తిచేసుకున్న వృత్తిదారులకు సర్టిఫికెట్లను అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు శుక్రవారం అందజేశారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రవీణ్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ నవీన్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేవరాజు, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామిరెడ్డి, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సుశీల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, స్టీరింగ్ కమిటీ మెంబర్ నాగేశ్వర్‌రావు గౌడ్, శిక్షకులు హెప్సీబా, బేబీ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

దమ్మపేట, సెప్టెంబర్ 20: దమ్మపేట లయన్స్ క్లబ్ కమిటీ గురువారం రాత్రి మల్లారం రైతు వేదికలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా అంకత ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా రాసూరి వేణుగోపాలరావు, కోశాధికారిగా పసుమర్తి ముక్తేశ్వరరావు, కమిటీ సభ్యులతో ఇండక్షన్ ఆఫీసర్ కాపా మురళీకృష్ణ ప్రమాణం చేయించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను, ఇతరత్రా అవార్డులు అందుకున్న మరికొందరిని క్లబ్ బాధ్యులు సన్మానించారు.

## పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

చంద్రుగొండ, సెప్టెంబర్ 20: ఎవరికి వారు తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలందరి ఆరోగ్యం బాగుంటుందని ఎర్రగుంట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ప్రియాంక అన్నారు. మండలంలోని దామరచర్ల గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మురుగు, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు.

## డోర్ టు డోర్ ఫీవర్ సర్వే

దుమ్ముగూడెం, సెప్టెంబరు 20: దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహించారు. తొలుత గ్రామంలో ఫ్రైడే..డ్రైడే సందర్భంగా గ్రామస్తులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తించి వారి నుంచి రక్తనమూనాలు సేకరించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం లక్ష్మీనగరం ఏకలవ్య వసతిగృహంలో దోమలు వ్యాప్తిచెందకుండా దోమల మందును పిచికారీ చేయించారు. ఆర్‌ఎంపీ క్లీనిక్‌లను సందర్శించి పరిమితికి మించి వైద్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన గ్రీన్ భద్రాద్రి

భద్రాచలం, సెప్టెంబరు 20: పట్టణంలోని చర్ల వెళ్లే ప్రధాన రహదారి వెంట గ్రీన్ భద్రాద్రి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థ అధ్యక్షుడు ఉమాశంకర్‌నాయుడు సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏళ్లుగా గ్రీన్ భద్రాద్రి సంస్థ పట్టణ ప్రముఖులు, దాతల సహకారంతో అన్ని కాలనీల్లో, రహదారుల వెంట వేలాది మొక్కలు నాటామన్నారు. వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలుగా మార్చామన్నారు. భద్రాద్రిని గ్రీన్ భద్రాద్రిగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పామరాజు తిరుమలరావు, సహాయ కార్యదర్శి పూసం రవికుమారి, మాజీ అధ్యక్షులు బోనాల సూర్యనారాయణ, బెల్లంకొండ రాంబాబు, మహిళా కార్యదర్శి తుమ్మల రాణి తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి రైతు మృతి

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 20: క్షణికావేశంలో పురుగుల మందు తాగి రైతు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని రాఘవాపురం పంచాయితీలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రతీష్ తెలిపిన వివరాల ప్రకారం... రాఘవాపురం పంచాయతీ చంద్రాపురం గ్రామానికి చెందిన చందా సమ్మయ్య(48) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఓ ప్రైవేటు ఆసుప్రతికి తీసుకెళ్ళాగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై రతీస్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు పంపించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

టేకులపల్లి, సెప్టెంబర్ 20: బైక్, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతిచెందాడు. మండలంలోని రాంపురం పంచాయతీ పాత తండాకు చెందిన బానోత్ అశోక్ (24) శుక్రవారం ద్విచక్ర వాహనంపై పాల్వంచ వెళ్తున్నాడు. ఎదురుగా కొత్తగూడెం నుంచి ఆటో వచ్చింది. బొమ్మనపల్లి గ్రామ సమీపంలో ఇవి రెండూ ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన బానోత్ అశోక్, ఖమ్మం ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి మృతిచెందాడు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసున మోదు

భద్రాచలం, సెప్టెంబరు 20: పట్టణంలోని లంబాడీకాలనీలో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు జరుగుతున్న సమయంలో పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న టౌన్ ఎస్సై విజయలక్ష్మితో పాటు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన పలువురు వ్యక్తులపై శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు టౌన్ ఎస్సై పీవీఎన్ రావు తెలిపారు.

## 'విధుల నుంచి అకారణంగా తొలగించారు'

టేకులపల్లి, సెప్టెంబర్ 20: తనను విధుల నుంచి ఐటీడీఏ పీవో అకారణంగా తొలగించారని టేకులపల్లిలోని ఏకలవ్య స్కూల్ టీజీటీ హిందీ ఔట్ సోర్సింగ్ టీచర్ వాంకుడోత్ ప్రేమ్‌లాల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పీవో వద్దకు వెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుడనైన తనకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 20: మండలంలోని పెంట్లం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారి సాయి తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫర ఉండదని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 20: అన్నపురెడ్డిపల్లిలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో మహాలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సర్వం సిద్ధం చేయాలని సిబ్బందితో చెప్పారు.

## పీఆర్‌టీయూ కమిటీ ఎన్నిక

చంద్రుగొండ, సెప్టెంబర్ 20: పీఆర్‌టీయూ మండల కమిటీని చంద్రుగొండలో శుక్రవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ఎ.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ వెంకటేశ్వరరావు, సహాధ్యక్షుడిగా జి.సక్రు, సహాయ కార్యదర్శిగా ఎస్.నరేష్, మహిళా కార్యదర్శులుగా డి.సుకన్య, బేబీరాణి, గౌరవాధ్యక్షుడిగా జి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మండల మాజీ అధ్యక్షుడు ఎండి.ఆరిఫ్ హుస్సేన్ వ్యవహరించారు. జిల్లా నాయకులు బి.రవి, జి.వెంకటేశ్వర్లు, ఎంవీఎస్.మూర్తి, వారణాసి వెంకటేశ్వర్లు, ఎండి.వాజీద్, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఓజోన్ దినోత్సవం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 20: ఇల్లెందులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య నిర్వహించారు. పర్యావరణానికి ఏర్పడుతున్న ముప్పును, దాని పర్యవసనాలను విద్యార్థులకు వివరించారు. ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాకేష్ శ్రీరామ, అధ్యాపకులు కృష్ణవేణి, శేఖర్, ప్రభాకర్‌రావు, శ్రీదేవి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రాజు, సరిత, సురేంద్రకుమార్, ఈశ్వర్, రాజు పాల్గొన్నారు.

## తడి-పొడి చెత్తపై అవగాహన

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 20: మండలంలోని కేశవాపురం, తోగ్గూడెంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి నిర్వహించారు. పారిశుధ్యం, తడి-పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

## సహాయం కావాలా.. దరఖాస్తు చేసుకోండి

పాల్వంచ, సెప్టెంబర్ 20: జిల్లాలోని పేద ఆర్య వైశ్యులు.. విద్య, వివాహాలకు సహాయం కోసం ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని వాసవీ ఆర్యవైశ్య విద్య, వివాహ సహాయ ట్రస్ట్ అధ్యక్షుడు సీహెచ్ దేవీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారానికి బాధ్యులను 9848183504, 9848723131, 9848071423, 9440991682 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

## జేసీసీ ఆవిర్భావ సభ

పాల్వంచ, సెప్టెంబర్ 20: తెలంగాణ విద్యుత్ ఆర్టీజన్ జాయింట్ కన్వర్షన్ కమిటీ(జేసీసీ) ఆవిర్భావ సభ శుక్రవారం కేటీపీఎస్‌లో జరిగింది. రాష్ట్ర చైర్మన్ శంకర్, నాయకులు తోట త్రినాథ్, నరసింహారెడ్డి, రాములు, రమేష్, మంగీలాల్, రజినిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వెబ్‌సైట్‌లో క్రూడ్ పామాయిల్ వివరాలు

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 20: తెలంగాణ ఆయిల్ ఫెడ్ వెబ్‌సైట్‌లో క్రూడ్ పామాయిల్ అమ్మకం ధరలు తదితర వివరాలను ఉంచనున్నట్లు ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, పీ అండ్ పీ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ సిద్ధమవుతున్నదని పేర్కొన్నారు.